క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం


స్కేటింగ్ ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహద పడతాయని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి స్కేటింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన కమిషనర్ మాట్లాడుతూ.. వి ద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్, కోశాధికారి అబూబకర్ పాల్గొన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్: రబీలో అన్నదాతలు అధికంగా సాగు చేసే శనగ విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత సంవత్సరం రబీ తీవ్ర నష్టాలను మిగిల్చిందని, ఇప్పుడు రైతులు సాగు చేసేందుకు విత్తనాలు లేవన్నారు. బహిరంగ మార్కెట్‌లో శనగ విత్తనం క్వింటాల్ రూ.7500 ఉండగా వ్యాపారులు రూ.9 వేలకు అమ్ముతూ లాభపడుతున్నారని వివరించారు. రైతులను ఆదుకునేందుకు 50 శాతం సబ్సిడీతో విత్తనాలను అందించాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక చేయూత

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా పుచ్చకాయలమాడలో రెండు కుటుంబాలను ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. అందులో భాగంగా తలారి గంగమ్మ చిన్న కుమారుడు అశోక్‌కుమార్‌కు ఎలక్ట్రిక్ ఆటో, అదే గ్రామానికి చెందిన మరో మహిళ కవిత భర్త రాముడు వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ కింద రూ.లక్ష ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఈ క్రమంలో అశోక్‌కుమార్‌కు అందించేందుకు రూ.3.8 లక్షల విలువ చేసే ఆటోను కొనుగోలు చేశారు. అలాగే కవిత భర్తకు రూ.లక్ష చెక్కును కలెక్టర్ అందజేశారు. అశోక్ కుమార్‌కు ఆటోను కలెక్టర్ పి.రంజిత్‌బాషా, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ చేతుల మీదుగా కలెక్టరేట్‌లో అందజేశారు.

అక్రమ బదిలీలు రద్దు చేయాలి

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ రాయలసీమ జోన్‌లోని జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, లైబ్రరీ, కాంట్రాక్టు లెక్చరర్ల బదిలీల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, తక్షణమే బదిలీలను నిలుపుదల చేసి, అక్రమాలకు పాల్పడిన ఇంటర్ బోర్డు ఆర్జేడీ ఎస్.రవి నాయక్‌ను సస్పెండ్ చేయాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం బిర్లా కాంపౌండ్‌లోని ఓ కాన్ఫరెన్స్ హాలులో ఆయన మాట్లాడారు. జూనియర్ కాలేజీల్లో బదిలీలు, పదోన్నతుల గురించి ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్‌కు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే ఆర్జేడీ అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో వైఎస్సార్ జిల్లాలో పని చేసిన సమయంలో అవినీతి రుజువు కావడంతో సస్పెండ్ అయ్యారని, ఇలాంటి అధికారిని ఆర్జేడీగా కొనసాగిస్తూ కూటమి ప్రభుత్వం అవినీతిని ప్రోత్సహిస్తుందన్నారు. తక్షణమే సస్పెండ్ చేసి, ఆర్జేడీ అక్రమాలపై సీబీడీతో విచారణ చేసి వాస్తవాలను వెలికి తీయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం నాయకులు బాలకృష్ణ, దివాకర్, నంద, శివ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ రాష్ట్ర జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్): హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న 38వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ బాలుర పోటీలకు రాష్ట్ర జట్టును ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ప్రకటించారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

కర్నూలు (టౌన్): క్రీడాకారులు లక్ష్య సాధన కోసం కృషి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సూచించారు. నగర శివారులోని ఆదర్శ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం సాయంత్రం 68వ రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, ఇంటర్ బోర్డు వృత్తి విద్యా అధికారి పరమేశ్వర రెడ్డి, ఆర్ఐఓ గురువయ్య శెట్టి, తిమ్మయ్య, హర్షవర్ధన్, రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, గుడిపల్లె సురేంద్ర, వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

పారా షూటింగ్‌లో పసిడి

కర్నూలు (టౌన్): గత నెల 29 వ తేదీ విశాఖపట్నంలో నిర్వహించిన మూడో రాష్ట్ర స్థాయి పారా షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు క్రీడాకారుడు ముస్తాక్ అహ్మద్ సత్తాచాటాడు. 10 మీటర్ల పిస్టల్ విభాగంలో 360 పాయింట్లు సాధించి పసిడి పతకం చేజిక్కించుకున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ఆ క్రీడాకారుడిని శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా రైఫిల్ షూటింగ్ సంఘం కార్యదర్శి ఎం.డి. బాషా పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయలు, కుల సంఘాల ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ చూపించిన మార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. అహింసే ఆయుధంగా దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత గాంధీ మహాత్మునికే దక్కిందన్నారు.

➡ ఉర్దూ విశ్వవిద్యాలయంలో జరిగిన వేడుకల్లో వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.ఎస్.షా.వలిఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు.

➡ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో కార్యదర్శి కె.ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, ఉద్యోగులు, పాఠకులు గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పించారు.

➡ రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ కార్యాలయం మౌర్యా ఇన్‌లో గాంధీజీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రచయిత, సినీ దర్శకుడు మోటకట్ల సుబ్బారెడ్డి రచించిన 'మహాత్మా గాంధీ మళ్లీ పుడితే' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కర్నూలు(అర్బన్): జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ప్రతి ఒక్కరు అనుసరించాలని కురువ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మహాత్ముడి విగ్రహానికి సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: మహాత్మాగాంధీ సూచించిన అహింసా మార్గం ప్రపంచ సుఖశాంతులకు మార్గదర్శకం అని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఉమాపతి అన్నారు. విద్యుత్ భవనంలో ఎస్సీ ఉమాపతి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాఘవులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వివాళులర్పించారు.

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ బాపూజీని స్ఫూర్తిగా తీసుకుని జీవనం సాగించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆసుపత్రిలోని గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

➡ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశస్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ పోరాడిన వైనం గురించి వివరించారు.

కర్నూలు (టౌన్): బ్రిటిష్ బానిసత్వం నుంచి స్వాతంత్ర్యం సాధించడంలో ముఖ్య భూమిక పోషించిన జాతిపిత మహాత్మగాంధీ జీవితం జగతికి ఆదర్శమని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. నగరపాలక కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ, దేశ మాజీ ప్రధాని, భారత రత్న లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి పురస్కరించుకొని వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునీద్, కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రమేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణ పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే స్ఫూర్తిగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాలని పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజనీరు వీ రామచంద్రారెడ్డి సూచించారు. స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయం విశ్వేశ్వరయ్య భవన్‌లో మహాత్మా గాంధీ చిత్రపటానికి ఇంజినీర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఐయు ఈఈ రామక్రిష్ణారెడ్డి, పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీ రవీంద్రారెడ్డి, ఆర్ సతీష్‌కుమార్, డీఈఈలు బండారు శ్రీనివాసులు, కర్రెన్న, ఏఈలు విజయభాస్కర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు జాతిపిత గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి ప్రసంగించారు. మహాత్మ గాంధీ జీవితం, ఆయన ఆచరించిన అహింసా విధానాలు అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న నాగేశ్వరయ్య, రఫీక్‌లను ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వి కృష్ణారెడ్డి, ఎస్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

➡ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపల్ డా.ఎస్.నాగస్వామి నాయక్ పాల్గొని గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

➡ మైపర్‌లో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జే.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అకడమిక్ డీన్ డాక్టర్ ఎం.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో గాంధీ జయంతి

కర్నూలు (లీగల్): జాతిపిత మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమం జిల్లా జైలులో ఘనంగా నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖైదీలకు గాంధీజీ జీవితం, పోరాటాలు, సూక్తులు, ముఖ్యమైన సందేశాల గురించి తెలియజేశారు. అనంతరం పండ్లు పంచారు. ఖైదీలకు ఆటల పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి, హోంగార్డ్ కమాండెంట్ మహేష్‌కుమార్, జిల్లా జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.నరసింహారెడ్డి, జైలర్ జి.యర్కి నాయుడు, డిప్యూటీ జైలర్ పి.అనిల్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు


నివాళులర్పిస్తున్న పీఆర్ ఇంజనీర్లు


నివాళులర్పిస్తున్న కురువ సంఘం నేతలు


నివాళులర్పిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఆదాయం కోసం పేదల రక్తాన్ని పీల్చుతారా?

● నూతన మద్యం పాలసీని విరమించుకోకపోతే పోరాటాలకు దిగుతాం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం కోసం పేదల రక్తాన్ని పీల్చుతారా అని సీఎం చంద్రబాబు నాయుడుపై ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్ మండిపడ్డాయి. నూతన మద్యం పాలసీని విరమించుకోకపోతే మహిళలతో కలసి రోడ్లపైకి వస్తామని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నూతన మద్యం పాలసీని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణి రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. నూతన మద్యం పాలసీలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 2900 షాపులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్‌లు ఇచ్చేలా పూనుకోవడం అన్యాయమన్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను అనుమతిస్తే పేదలు తాగి చావరా? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో పెట్టిన ఖర్చును తిరిగి తెచ్చుకునేందుకే మద్యం షాపులను ప్రైవేట్‌కు ఇచ్చారని, ఇది దారుణ చర్య అని మండిపడ్డారు. నూతన మద్యం పాలసీపై మహిళల అభిప్రాయాలు తూతూమంత్రంగా సేకరించారని ఆరోపించారు. వివిధ రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలకు సమయం తక్కువగా ఇస్తుండగా ఇక్కడ మాత్రం రోజులో 13 గంటలకుపైగా అమ్ముకోవడానికి అనుమతులు ఇవ్వడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. నూతన మద్యం పాలసీ వస్తే కుటుంబాల మధ్య, కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు, వివాదాలు పెరుగుతాయన్నారు. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు ఎక్కువయ్యే ప్రమాదం ఉందని వాపోయారు. మద్యాన్ని సేవించిన వారు అనారోగ్యం పాలవుతారని, వీటన్నింటినీ ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోకుండా నూతన మద్యం పాలసీని తేవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాగేంద్రమ్మ, పావని, విజయ, శైలజ, కోటమ్మ, సులోచనమ్మ, ఆదిలక్ష్మీ, మల్లేశ్వరి, సుశీలమ్మ, శారదమ్మ పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

బాబు పర్యటనతో జిల్లాకు నిరాశే

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు కర్నూలు జిల్లా పర్యటన ప్రజలను తీవ్ర నిరాశ పరిచిందని, ఆయన జిల్లాకు ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వకపోవడం అన్యాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పేర్కొన్నారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లోని వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్ ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తారని ఆశిస్తే మాట చెప్పి తప్పించుకొని వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి 106 చెరువులకు నీటిని ఎప్పటిలోగా నింపుతారో చెప్పకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిపై మాట్లాడకుండా వెళ్లిపోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. పత్తికొండలో టమాట జ్యూస్ ఫ్యాక్టరీ, ఆలూరులో జింకల ఫ్యాక్టరీ తదితర ప్రాజెక్టులపై స్పష్టత ఇవ్వకపోవడంపై ప్రజలు తీవ్ర నిరాశ చెందారని ఆయన వివరించారు. నాయకులు పి.రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు,మహేష్, శ్రీనివాసులు, శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ధర్నా చౌక్‌లో విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు బుధవారంతో రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకవైపు ప్రైవేటీకరణకు కేంద్రం వేగంగా అడుగులు వేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర పెట్టుబడికి నిధులు లేవని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే చెబుతుంటే ఏమి చేయాలని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ విశాఖ ఉక్కు కోసం పోరాటాలు చేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు కిమ్మనకుండా ఉండడం అన్యాయమన్నారు. మరోవైపు తొలగించిన 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని, దాని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో పోరాటాలను ఉద్ధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.అజయ్ బాబు, పీఎస్ రాధాకృష్ణ, నాయకులు నాగన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.


దీక్షలో మాట్లాడుతున్న అంజిబాబు, ఎస్.మునెప్ప

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి కరాటే పోటీలకు స్థానిక టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న కె.బద్రీనాథ్ రెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 1వ తేదీ వైఎస్సార్ జిల్లా రాజంపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో కరాటే రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బద్రీనాథ్ రెడ్డి ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు టౌన్ మోడల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న వెల్లడించారు.


కె.బద్రీనాథ్ రెడ్డి

మధ్యంతర భృతి ప్రకటించాలి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పీఆర్‌సీ ఇచ్చేంత వరకు మధ్యంతర భృతిని ప్రకటించి అమలు చేయాలని డీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా పరిషత్ వద్ద మహాత్మ గాంధీ విగ్రహం ఎదుట ఆ సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరె క్రిష్ణ మాట్లాడుతూ.. ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న జీఓ నంబరు 117ను రద్దు చేయాలని, ఆంగ్ల భాష మాధ్యమంతో పాటు, మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, కిశోర్, గట్టు తిమ్మప్ప, ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు, గోట్ల చంద్రశేఖర్, జిల్లా కమిటీ బాధ్యులు వెంకటేశప్ప, ఈశ్వర్ రెడ్డి, రామన్న, రోసన్న, తదితరులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న డీటీఎఫ్ నాయకులు

వ్యర్థాల రీసైక్లింగ్‌తో ప్రగతి

కర్నూలు (రూరల్): వ్యర్థాల రీసైక్లింగ్‌తో ప్రగతి సాధించవచ్చని మంత్రి టీజీ భరత్ సూచించారు. బుధవారం గార్గేయపురం డంపింగ్ యార్డు వద్ద ఎంఆర్ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ) యూనిట్‌కు కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ దివస్ - 2024 కార్యక్రమంలో భాగంగా రూ.988 కోట్లతో స్వచ్ఛ భారత్ మిషన్ 2.0, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులతో ఎంఆర్ఎఫ్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈ ప్లాంటు ఆరు నెలల్లో పూర్తవుతుందని, ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, పొడి చెత్తతో ఎరువుల తయారీ, ఇతర జడ వ్యర్థాలను భవన, రహదారుల నిర్మాణాలకు ఉపయోగించవచ్చని వివరించారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ.. యూనిట్‌కు వచ్చే చెత్తచెదారాన్ని సెగ్రిగేట్ చేసి బైక్ ప్రొడక్ట్స్ తయారు చేస్తారని వివరించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరుచరిత, మున్సిపల్ కమిషనర్లు ప్రసంగించారు. ఆర్‌డీఓ శేషిరెడ్డి, తహసీల్దార్ రమేష్‌బాబు, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, సర్పంచ్ సోమేశ్వరమ్మ, ఎంపీటీసీ తెనె జ్యోతిలత, కార్పొరేటర్లు ఎం.విక్రమసింహారెడ్డి, పరమేష్, రమణమ్మ, జాకియా అన్సరి, ఆరోగ్య అధికారి డాక్టర్ వి.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ జి.రాజశేఖర్, ఎంఈ సత్యనారాయణ, డీఈఈ నరేష్, ఏఈ దినేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎంఆర్ఎఫ్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ నాగరాజు, కలెక్టర్, మేయర్, ఎమ్మెల్యేలు

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు(సెంట్రల్): కేవీపీఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జిల్లాలోని 8 ప్రాంతాల్లో 19 చోట్ల కేవీపీఎస్ జెండాలను ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. కల్లూరు అర్బన్ పరిధిలోని ముజఫర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శాశ్వత పోల్ వద్ద జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు నీలి రంగు జెండాను ఆవిష్కరించారు.అంతకుముందు సుందరయ్య సర్కిల్ నుంచి ముజఫర్ నగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే 23వ వార్డు పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండీ ఆనందబాబు మాట్లాడుతూ.. కుల వివక్షపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచినా నేటికి గ్రామీణ ప్రాంతాల్లో దళితులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయా కార్యక్రమాల్లో పీఎస్ రాధాకృష్ణ, ఎం.భాస్కర్, ఆనంద్, రామాంజనేయులు, ధనలక్ష్మీ, సుధాకరప్ప పాల్గొన్నారు.


కేవీపీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎండీ ఆనంద్‌బాబు

దాండియా సరదా

కర్నూలు కల్చరల్: స్థానిక జొహరాపురం రోడ్‌లోని వండర్ కబ్స్ ప్రీ స్కూల్‌లో బుధవారం రాత్రి దాండియా ఉత్సవం వైభవంగా జరిగింది. దసరా నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కేడీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి, స్కూల్ డైరెక్టర్ దివ్య తేజ, ఈవెంట్ ఆర్గనైజర్ రుజిత పాల్గొన్నారు. యువతులు, మహిళలు దాండియా ఆడుతూ జోష్ నింపారు.


దాండియాలో పాల్గొన్న ఎస్వీ విజయ మనోహరి

ప్రజా కళాకారుడు వాసు

కర్నూలు(సెంట్రల్): ప్రజా కళాకారుడు వాసు జీవితం ఆదర్శమని పీఎస్ఎం శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి పి.నిర్మల పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య భవన్‌లో వాసు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమీలియో హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆయన రచించిన పాటలను కళాకారులు ఆలపించారు. కార్యక్రమంలో కె.అరుణ, సుజాత, లోకేష్, బతుకన్న తదితరులు పాల్గొన్నారు.

కాలేజీపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): గాంధీజయంతి రోజున తరగతులు నిర్వహించిన కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. గాంధీ జయంతి సందర్భంగా కళాశాలకు సెలవు ప్రకటించాల్సి ఉన్నా యాజమాన్యం పట్టించుకోకుండా తరగతులు నిర్వహించడం తగదన్నారు.

దేశ సంపదను ప్రైవేటుపరం చేస్తున్న మోదీ

కర్నూలు(సెంట్రల్): దేశ సంపదను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రైవేట్ పరం చేసి అంబానీ, అదానీలను ప్రపంచ కుబేరులుగా మారుస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణయాదవ్ ఆరోపించారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, దేశాన్ని మోదీ బారి నుంచి కాపాడాలని మహాత్ముడికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. తరువాత కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దేశ సంపదను దోచి పెడుతున్న మోదీకి త్వరలోనే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మాజీ మంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా పాల్గొన్నారు.